క్లుప్తంగా

ధ్యాన మందిర నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు: పెదపులిపాక గ్రామం విశ్వబంధు తపోవన్ ట్రస్టు ఆశ్రమ ప్రాంగణంలో నూతనంగా సద్గురు ధ్యాన మందిరి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఆదివారం ఉదయం 10.42 గంటలకు విజయరాజరాజేశ్వరి విద్యాపీఠం వ్యవస్థాపకుడు వాసుదేవానందగిరిస్వామీజీ ఆధ్వర్యంలో సద్గురు ధ్యాన మందిరం నిర్మాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. చంద్రఖాళీవన ఆశ్రమ పీఠాధిపతి మాతాజీ ముఖ్య అతిథిగా వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సప్తరుషి పూజ, లలితాసహస్రనామ సామూహిక పారాయణతో పాటు పలు పూజలు నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ఎంవీవీ సూర్యనారాయణ, తొండెపు హనుమంతరావు, పేర్ల వెంకటేశ్వరరావు, గుత్తికొండ రమేష్‌బాబు, సూర్యనారాయణ, పలువురు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

పేదలకు సరుకులు పంపిణీ



కంకిపాడు: సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి, ఇంజినీరు రావి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఈడుపుగల్లు గ్రా మంలో ఆదివారం పేద విద్యార్థులకు ఆర్థికసాయం, వైద్యం అవసరమైన వారికి మందులు, నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచ్ పందిపాటి ఇందిర, పడవల మధుసూదన్‌రావు, గోరంట్ల నరేంద్ర, పోతురాజు శ్రీనివాసరావు, చెల్లి సంగీతరావు, నందమూరి మాధవరావు, పర్వతనేని రవి, పందిపాటి సుధాకర్ పాల్గొన్నారు.

పోరంకిలో యువకుల మధ్య ఘర్షణ

పెనమలూరు: పోరంకిలో ఇరు వర్గాలకు చెందిన యువకులు రెచ్చి పోయి ఘర్షణకు దిగారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి నిడమానూరు, పోరంకికి చెందిన యువకులు గ్రామ శివారు గ్యాస్ గోదామ్ వద్ద పరస్పరం కొట్టుకున్నారు. ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు బీరు సీసాలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సీఐ శ్రీనివాసరావును వివరణ కోరగా దాడులపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉందన్నారు.

ముస్లింల హక్కుల కోసం పోరాటం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువస్తున్న సంక్షేమ పథకాలు ఆదర్శనీయమని, ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) నిరంతరాయంగా కృషిచేస్తుందని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఏఎంసీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎండీ కాలేషా అధ్యక్షతన ఆ కమిటీ సమావేశం సింగ్‌నగర్‌లో ఆదివారం జరిగింది. ముందుగా షేక్ మస్తాన్ వలీని నగర కార్యనిర్వాహక కార్యదర్శిగా అలాగే ఎండీ రఫీ ను ఆజాద్ ముస్లిం కమిటీ 61వ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాలు అందించారు. ఈనెల 17వ తేదీన ఆజాద్ ముస్లిం కమిటీ ఏపీ నూతన కమిటీ ఎంపిక కార్యక్రమం గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో జరుగుతుందని తెలిపారు.

మురుగు కాలువల్లో వ్యర్థాలు వేస్తే చర్యలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లోని మురుగు కాలువల్లో పేరుకు పోయిన సిల్ట్‌ను తొలగించే కార్యక్రమానికి ఏపీఐఐసీ, ఐలా అధికారులు శ్రీకారం చుట్టారు. మురుగు కాలువల్లో ఏళ్ల నాటి నుంచి పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్నారు. వర్షాకాలంలో సరిగా కాలువలు పారుదల లేదు. గతంలో డ్రైయినేజీలను పరిశుభ్రం చేసే కార్యక్రమం చేపట్టక పోవడంతో కొద్దిపాటి వర్షానికి రోడ్డు మీదకు మురుగు చేరి అసౌకర్యంగా మారింది. స్థానికులు నానా అవస్థలు పడిన సందర్భాలు లేకపోలేదు. ఈ విషయాన్ని గమనించిన ఏపీఐఐసీ, ఐలా అధికారులు సిల్ట్‌ను తీసేందుకు గాను నిధులను మంజూరు చేశారు. ఇందులో భాగంగా శనివారం రెండో రోడ్డులోని మురుగు కాలువలో పూడిక తొలగించారు.

కానూరు 2కే రోడ్డుకు మహర్దశ

రూ.2.49 కోట్లతో అభివృద్ధి

పెనమలూరు: కానూరు 2కే రోడ్డుకు మహర్దశ పట్టింది. చాలా సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని 2కే రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేపట్టారు. కానూరు గ్రామం నుంచి నవతా మీదగా ఆటోనగర్‌కు 2కే రహదారి దాదాపు 2 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఈ రహదారి నుంచి ప్రతి నిత్యం ప్రజలు కానూరు నుంచి ఆటోనగర్, విజయవాడ, రామవరప్పాడుకు ప్రయాణిస్తున్నారు. విజయవాడ నగరానికి లింకు రోడ్డుగా ఉన్న 2కే రహదారి పై ప్రయాణిస్తే విజయవాడకు చాలా దూరం తగ్గటమే కాకుండా, సమయం, వ్యయం ఆదా అవుతుంది. అయితే 2కే రహదారిని గత దశాబ్దకాలంగా ఎవ్వరూ అభివృద్ధి చేయలేదు. రోడ్డు గుంతలు పడి ప్రయాణించటానికి వీలు లేకుండా ఉండేది. ఈ రోడ్డు పై నిత్యం ట్రాఫిక్ ఉండటంతో రోడ్డు వెడల్పుగా లేక తరచుగా ప్రమాదాలు జరిగేవి. ఆటోనగర్ నుంచి లారీలో 2కే రోడ్డు మీదగా వెళ్లటం వలన ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండేది. 2కే రోడ్డును విస్తరించి అభివృద్ధి చేయాలని స్థానికులు ఎంత మొరపెట్టుకున్నా ఎవ్వరు పట్టించుకోలేదు.



కానూరు చిన్న చెరువు వద్ద నిర్మించిన సీసీ రోడ్డు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మోక్షం...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2కే రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది.ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి 2కే రోడ్డు అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆయన చొరవతో నిధులు మంజూరయ్యాయి. ఆటోనగర్ వద్ద నుంచి ఇంటర్నేషనల్ స్కూల్ వరకు రోడ్డు నిర్మాణం రూ.1.20 కోట్లుతో 7 మీటర్ల వెడల్పుతో పనులు చేశారు. మిగతా రోడ్డుకు రూ.95 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ పనులు కూడా త్వరలో ప్రారంభించి పూర్తి చేయనున్నారు. రహదారిలో కల్వర్టు నిర్మాణం పూర్తి చేశారు.

చిన్న చెరువు కట్ట పై సీసీ రోడ్డు....

ఆటోనగర్ నుంచి ఉన్న 2కే రోడ్డు కానూరు చిన్న చెరువు వద్ద గ్రామవంలోకి ప్రవేశిస్తుంది. భారీ వాహనాలు రాకపోకలు సాగించటంతో చిన్న చెరువు కట్ట పై ఇటీవల రూ.34 లక్షలతో సిమెంట్ రోడ్డు కీవాల్‌తో నిర్మాణం చేశారు. దాదాపు 120 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం చేయటంతో చాలా కాలంగా చెరువు కట్టపై ఉన్న గుంతల రోడ్డుకు విముక్తి లభించింది. ఈ రోడ్డు నిర్మాణం వలన 2కే రోడ్డులో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా రాకపోకలు సాగించటానికి మార్గం సుగమం అయింది.

మగ్గం సామగ్రి అందజేత

గన్నవరం: పేదల అభ్యున్నతికి నూర్‌బాషాలు, దూదేకుల ముస్లిం మైనార్టీల సంక్షేమ సంఘం తొడ్పాటు అందిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పులమర్తి చిన్నమస్తాన్ పేర్కొన్నారు. మండలంలోని దావాజిగూడెంలో సంఘ కార్యాలయంలో ఆదివారం పలువురు పేద మహిళలకు చీరలు, మగ్గం వర్క్ శిక్షణ పొందుతున్న మహిళలకు పనిముట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పలు సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా పులిమర్తి మాట్లాడుతూ..తమ సంఘం ద్వారా నూర్‌బాషాలు, దూదేకుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. పేద వర్గాలకు చెందిన మహిళలకు, విద్యార్థులకు తమవంతు సాయం అందిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో తమ సేవలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి హుస్సేన్, నియోజకవర్గ అధ్యక్షులు డి.రాజిరసూల్, ప్రధాన కార్యదర్శి రహంతుల్లా, మహిళా అధ్యక్షురాలు ఖాదర్‌బీ పాల్గొన్నారు.



మహిళలకు మగ్గం పనిముట్లు అందజేస్తున్న చిన్నమస్తాన్

సమాజానికి ఉన్నత సేవలు అందించాలి

పెనమలూరు: సత్యసాయి సేవాదళ సభ్యులు సమాజానికి ఉన్నత సేవలు అందించి మార్గదర్శకులుగా నిలవాలని సత్యసాయి సేవాసమితి కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ అన్నారు. పెనమలూరు శ్రీ భగవాన్ సాయి మందిరంలో ఆదివారం సత్యసాయి సేవాదళ సభ్యుల శిక్షణ నిర్వహించారు. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, గన్నవరం, హనుమాన్‌జంక్షన్ పరిసర ప్రాంతాల నుంచి సత్యసాయి అనుబంధ భజన మండలి సభ్యులు, కన్వీనర్లు, సమన్వయకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమరగిరి చంద్రశేఖర్ మాట్లాడుతూ సేవాదళ సభ్యులు సేవపై అంతర్యం తెలుసుకోవాలని సూచించారు. సమాజానికి విశిష్టమైన సేవలు అందించి మార్గదర్శకులుగా నిలవాని కోరారు. సభ్యులు ఆధ్యాత్మిక విలువలు, మానవ సంబంధాలు, విలువలతో కూడిన సేవల పై ఆయన వివరించారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు శ్యాంప్రసాద్, ఆధ్యాత్మిక సమన్వయకర్త అడపా భాస్కరరావు, రాష్ట్ర మహిళా సమన్వయకర్త స్నేహలత, సభ్యులు ఆంజనేయకుమార్, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జ్ కె.నాగప్రసాద్, వి. మోహన్‌రావు, లక్ష్మిప్రసూన పలువురు పాల్గొన్నారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న కొమరగిరి చంద్రశేఖర్

వర్షంతో పంటలకు ఊపిరి



వర్షపునీటితో నిండిన కంకిపాడు-గన్నవరం రహదారి



ఊపిరి పోసుకుంటున్న పసుపు చేలు

కంకిపాడు: ఆవర్తన ప్రభావంతో శనివారం తెల్లవారుజామున మండలం వ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. వర్షానికి ఉరుములు, మెరుపులు తోడయ్యాయి. రెండు గంటలకు పైగా భారీ వర్షం పడింది. దీంతో కంకిపాడు పట్టణంలోని బస్టాండు సెంటరు, రైతుబజారు ఏరియా, పునాదిపాడు ఫ్లైఓవర్ పరిసరాలు, గోసాల సెంటరుతో పాటుగా మండలంలోని పలు పల్లపు ప్రదేశాలు, లేఅవుట్‌లలో నీరు నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చింది. అయితే కొద్ది రోజులుగా ఎండవేడిమి, ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజానీకం వర్షం కారణంగా వాతావరణం చల్లబడటంతో ఊరట చెందారు. కొద్ది రోజులుగా వానలు వెనుకడుగు వేశాయి. వర్షాభావ పరిస్థితులతో వరితో పాటుగా వాణిజ్య పంటల ఎదుగుదల లోపించింది. నీటి తడులు అందించినా వర్షాలు లేక పైరు ఎదుగుదల ఆశించిన మేరకు లేదు. ఈ పరిస్థితుల్లో ఆవర్తన ప్రభావంతో కుండ పోత వర్షం కురవటంతో పంటలకు జీవమొచ్చింది. మరో రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచిస్తోంది. దీంతో పొలాలు ఊపిరిపోసుకుని, ఎదుగుదల ఆశాజనకంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. వాతావరణం తెరపివ్వగానే పైపాటు, యాజమాన్య పనులు చేపడితే పైర్ల సంరక్షణ సాధ్యమవుతుందని రైతులు అంటున్నారు.

చికిత్స పొందుతూ మాజీ ఎంపీపీ పిచ్చిరెడ్డి మృతి

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మాజీ ఎంపీపీ పిచ్చిరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్ లో ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు... ఉయ్యూరు మండలం పెద ఓగిరాల గ్రామానికి మాజీ ఎంపీపీ భీమవరపు పిచ్చిరెడ్డి, మరో వ్యక్తితో కలిసి కంకిపాడు సమీపంలోని అయనా ఫంక్షన్ హాల్లో వేడుకకు శనివారం హాజరయ్యారు. ఫంక్షన్ అనంతరం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా పునాదిపాడు ఫ్లైఓవర్ సమీపంలో వెనుకగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో భీమవరపు పిచ్చిరెడ్డి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున పిచ్చిరెడ్డి మృతి చెందారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ఘన గాన చరితుడు ఘంటసాల

విజయవాడ కల్చరల్: ఘనగాన చరితుడు మన ఘంటసాల వేంకటేశ్వరరావు అని నాదబ్రహ్మ సంగీత కళాశాల నల్గొండ డాక్టర్ ఎం. పురుషోత్తమాచార్య అన్నారు. స్వరాలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వేంకటేశ్వర్వరావు సంగీత కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం, ఘంటసాల సినీ సంగీత విభావరి పద్మశ్రీ ఘంటసాల సంగీత వైభవం అంశంగా ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పురుషోత్తమాచార్య మాట్లాడుతూ స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకొని తన జీవితాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకున్నారన్నారు. తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. సంస్థ అధ్యక్షుడు వై. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకులు డాక్టర్ పురుషోత్తమాచార్యను ఆత్మీయంగా సత్కరించారు. సినీ సంగీత విభావరి కార్యక్రమంలో భాగంగా ఘంటసాల స్వరపరచి గానం చేసిన మధురగీతాలను బాల కామేశ్వరరావు, శాంతిశ్రీ, వై. సుబ్రహ్మణ్యం పావని, ఎస్ఆర్ ప్రభాకర్ కల్యాణ శిరీష ఆలపించారు.



కార్యక్రమంలో పాల్గొన్న పురుషోత్తమాచార్య ప్రభాకర్, శాంతిశ్రీ తదితరులు

నేడు 'స్పందన'

విజయవాడరూరల్: స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తామని తహసీల్దార్ పి.జాహ్నవి రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో అర్జీల రూపంలో అందజేయాలని విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యనమలకుదురు నేతాజీ రోడ్డుకు చెందిన లాడి హేమలత ఆ ఏడాది జూన్ 7వ తేదీన ఒడిస్సా రాష్ట్రం రాయగడ జేకేపూర్‌కు చెందిన సంతోష్‌కుమార్‌ను కట్న కానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త జేకే పేపర్ మిల్స్‌లో పని చేస్తాడు. పెళ్లి సమయంలో హేమలతకు ఉన్న గుండె జబ్బు గురించి ముందుగానే చెప్పి పెళ్లి చేశారు. కాగా పెళ్లి చేసుకున్న మూడు రోజులకే తరువాత భర్త సంతోష్ కుమార్ గుండెజబ్బు ఉన్నందున అధిక కట్నం కావాలని డిమాండ్ చేస్తూ వేధించటం ప్రారంభించారు. భర్తతో పాటు అత్త ఉమ, బావ శివ, ఆడపడుచు భాగ్య, బంధువులు సృజన్, శ్రావ్య, కుమార్, అప్పలరాజు అదనపు కట్నం కోసం వేధించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు అత్తింటివారి పై కేసు నమోదు చేశారు.

ఇద్దరు పేకాటరాయుళ్ల అరెస్టు


పెనమలూరు: పేకాటాడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గోసాల గ్రామ పంచాయతీ పరిధి వైకుంఠపురం శివారులో కోతముక్క ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ రాజేష్ దాడి చేశారు. కోతముక్క ఆడుతున్న గోసాలకు చెందిన వి.దుర్గారావు, కంకిపాడుకు చెందిన కె.శంకర్‌రావు పట్టుబడ్డారు. మరో ఇద్దరు వ్యక్తులు ఎస్‌డీ కరీముల్లా, కె.రవీంద్ర పారిపోయారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.1700, రెండు మొబైల్ ఫోన్‌లు, 4 బైక్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల పై కేసు నమోదు చేశారు.

భవనంపై నుంచి దూకిన వ్యక్తికి గాయాలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భార్యతో గొడవపడి ఓ వ్యక్తి భవనంపై నుంచి కిందకు దూకేసిన ఘటన సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్ వెంబడి ఉన్న అపార్ట్‌మెంట్‌లలో ధూపాటి ఏసు, పర్వీన దంపతులు నివసిస్తున్నారు. కొంత కాలం క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే భార్యాభర్తల మధ్య కొన్ని రోజుల నుంచి చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం కూడా ఇదే విధంగా గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన ఏసు మూడో అంతస్తు నుంచి కిందకు దూకేందుకు ప్రయత్నించగా స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సింగ్‌నగర్ సీఐ గురుప్రకాష్, ఎస్ఐలు దుర్గాదేవి, సత్యనారాయణ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఏసు పరిస్థితి నిలకడగానే ఉందని, వివరాలు సేకరించి ఈ ఘటనపై తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): బధిరురాలైన చిన్నారి వైద్యం నిమిత్తం దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయాన్ని అందజేసింది. పటమట కాటా రోడ్‌లో నివసిస్తూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న శిరీష, రాజుల కుమార్తె రక్షిత (8) పుట్టుకతోనే చెవిటి, మూగ. చిన్నారి రక్షిత చెవులకు సర్జరీ చేస్తే వినగలుగుతుందని వైద్యులు చెప్పిన మీదట ఆపరేషన్ నిమిత్తం చిన్నారి తల్లిదండ్రులు దీవెన ఫౌండేషన్ సభ్యులను ఆశ్రయించారు. దీంతో విజయవాడ సిటీ పోలీస్ తరపున దీవెన ఫౌండేషన్ సభ్యులు పటమట ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ చేతుల మీదుగా రూ.10వేలు అందజేశారు. పటమట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్స్ పైడేశ్వరరావు, కల్యాణ్, రైటర్ సాంబశివరావు పాల్గొన్నారు. ఆపదలో ఉన్న పేదవారికి సహాయం అందిస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నారి రక్షిత తల్లికి ఆర్థిక సాయం అందిస్తున్న సీఐ కాశీ విశ్వనాథ్

ఉయ్యూరులో 96 శాతం పింఛన్ల పంపిణీ

ఉయ్యూరు: వైఎస్సార్ పింఛను కానుక ఉయ్యూరులో 96 శాతం పూర్తయింది. మండలంలోని 11 గ్రామాలతో పాటు, పట్టణంలోని 20 వార్డుల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియ ఆదివారం కొనసాగింది. పాత పింఛన్లతో పాటు కొత్తగా మంజూరైన పింఛన్లను వలంటీర్లు పంపిణీ చేశారు. మున్సిపాలిటీలో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, ఆయా వార్డుల్లోని కౌన్సిలర్లతో పాటు పింఛన్లను అందజేశారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు పింఛన్లను అందజేశారు. ఉయ్యూరు మండలం చిన ఓగిరాల గ్రామానికి చెందిన పెయ్యల గోపి అనారోగ్యంతో మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీరు సుజీకుమారి ఆసుపత్రికి వెళ్లి ఆదివారం గోపికి వృద్ధాప్య పింఛను అందజేశారు. ఎంపీడీఓ విమాదేవి పింఛను పంపిణీ ప్రక్రియ పరిశీలించి, వలంటీరు సుజీకుమారిని అభినందించారు.



ఎన్ఆర్ఐ ఆసుపత్రికి వెళ్లి గోపికి వృద్ధాప్య పింఛను అందజేస్తున్న చిన ఓగిరాల వలంటీరు సుజీకుమారి

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

ఉంగుటూరు: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఓ మహిళకు వలంటీరు పింఛను అందజేశారు. కొయ్యగూరపాడు గ్రామానికి చెందిన పాతూరి రాజామణి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని ఉంది. విషయం తెలుసుకున్న వలంటీరు రామపురపు సంధ్య ఆసుపత్రిలో ఉన్న రాజామణి వద్దకు వెళ్లి వితంతు పింఛను అందజేశారు. వలంటీరును పలువురు అభినందించారు.



విజయవాడ ఆస్పత్రిలో పింఛను అందజేస్తున్న వలంటీరు సంధ్య

ఉత్తమ ప్రొఫెసర్‌గా ఉదయశ్రీ

విజయవాడరూరల్: రూరల్ మండలం నున్న గ్రామానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ కొంపల్లి ఉదయశ్రీకి ఉత్తమ ప్రొఫెసర్ అవార్డు లభించింది. సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ (సొలిట్) సంస్థ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ఉత్తమ అధ్యాపకురాలిగా అవార్డులను ప్రకటించింది. ఈ సందర్భంగా ఆదివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు, కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ డి.సూర్యచంద్రరావు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎ. అమృతవల్లి, సొలిట్ ప్రతినిధి టి.క్రాంతికుమార్ అవార్డును అందజేశారు. పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఏఐఎంఎల్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న డాక్టర్ కొంపల్లి ఉదయశ్రీ, బోధనా ప్రక్రియలో విశేష ప్రతిభ కనబర్చిన అధ్యాపకులకు సొలిట్ సంస్థ వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రొఫెసర్లకు అవార్డులను అందచేశారు.



అవార్డు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ ఉదయశ్రీ

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

గన్నవరం: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో గన్నవరం ప్రాంత విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పాడ చంద్రశేఖర్‌రావు తెలిపారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిప్పాడ మాట్లాడుతూ... ఇటీవల విశాఖపట్నంలో కరాటే ఇండియన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో అండర్-14 విభాగంలో గన్నవరానికి చెందిన మాన్య బంగారు పతకాన్ని, సీహెచ్. శ్రావణి రజిత పతకాన్ని సాధించినట్లు తెలిపారు. అండర్-14 బ్లాక్ బెల్ట్‌ను బొమ్మరెడ్డి జయంత్ కైవసం చేసుకున్నట్లు వివరించారు. వీరందరూ ఈ నెల 9, 10 తేదీల్లో కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ యు.వెంకట్రామ్‌ను అసోసియేషన్ సభ్యులు అభినందించారు. కార్యదర్శి దేవరపల్లి విక్టర్‌బాబు, ప్రజ్ఞా స్కూల్ డైరెక్టర్ చెన్నారావు, రిటైర్డ్ ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కాలేయ సమస్యలు పెరుగుతున్నాయ్

ప్రముఖ వైద్యులు మహమ్మద్ రేలా

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆధునిక సమాజంలో కాలేయ వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని ప్రముఖ కాలేయ మార్పిడి వైద్య నిపుణుడు డాక్టర్ మహమ్మద్ రేలా అన్నారు. అందుకు అనుగుణంగా చికిత్సలు కూడా పెరగాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాలేయ చికిత్సల గురించి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహమ్మద్ రేలా మాట్లాడుతూ కాలేయ వ్యాధులు ప్రధానంగా ఆహార అలవాట్లు, మద్యపానం వల్ల సంభవిస్తాయన్నారు. కొందరికి పుట్టినప్పటి నుంచి ఉంటాయని, మరికొందరికి స్థూలకాయం ద్వారా, ఆల్కాహాల్ తీసుకోవడం వల్ల కాలేయం దెబ్బతింటుందన్నారు. అయితే విదేశాల్లో ఉన్న అధునాతన చికిత్సా విధానాలు ప్రస్తుతం మన దేశంలోనూ అందుబాటులో ఉన్నాయన్నారు. దేశంలో 200లకు పైగా కేంద్రాల్లో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఏటా 20 వేల మందికి కాలేయ మార్పిడి అవసరం ఉండగా, కేవలం 3 వేల మందికి మాత్రమే జరుగుతున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాల్సి ఉందన్నారు. ఏపీ ప్రభుత్వం రూ.10 లక్షలు రాయితీ ఇస్తుందని, దానిని మరింత పెంచితే బాగుంటుందన్నారు. ఆహార అలవాట్లను మార్చుకోవడం, సరైన వ్యాయామం చేయడం, ఆల్కాహాల్‌కు దూరంగా ఉండటం ద్వారా కాలేయ వ్యాధులు రాకుండా చూడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ విజయవాడ శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎంఏ రెహమాన్, డాక్టర్ పీవీ దుర్గారాణి, డాక్టర్ సీహెచ్ మనోజ్‌కుమార్, డాక్టర్ సీహెచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మహమ్మద్ రేలా, పక్కన డాక్టర్ రెహమాన్, పీవీ దుర్గారాణి తదితరులు

బాలుడి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమారుడు కనిపించడం లేదంటూ తండ్రి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట నైజాంగేటు ప్రాంతానికి చెందిన షేక్. అబ్దుల్ రహిమాన్ తన భార్యతో విభేదాల కారణంగా విడిపోయి, తన ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. రహిమాన్ కిళ్లీ కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తుంటాడు. కుమారుడు రయాన్ (11)గత నెల 30వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో స్నేహితులను, బంధువులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో తన కుమారుడు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. గతంలోనూ ఇదే తరహా ఇంటి నుంచి వెళ్లిపోగా, అప్పుడు పోలీసులు ఆచూకీ తెలుసుకున్నట్లు బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు.